# వైఎస్ఆర్-అన్నమయ్య వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

శుక్రవారం 15 ఆగష్టు 2025


## చంద్రబాబు వై నాట్ పులివెందులఖి నిజం చేశారు !!

### ఇంత ఘోర పరాజయం వైసిపి అంచనాలకే అందలేదా?

రాజంపేట, ఆగస్టు14 ప్రభాతవార్త

పులివెందుల అంటే వైయస్ అడ్డా. కాంగ్రెస్ పార్టీకి వైయస్ కోట పులివెందుల. దీనిపై కన్నెత్తి చూసే వారే కాదు. పులివెందులలో వైయస్ కుటుంబానికి పరాజయం ఏనాడూ వినిపించలేదు. వైయస్ మరణం తర్వాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించిన జగన్ మోహన్ రెడ్డి కూడా కొనసాగించారు. ముఖ్యమంత్రిగా గెలిచిన తర్వాత వైయస్ జగన్మోహన్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల్లో చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పం పై కన్ను పడింది. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తో చర్చించిన తర్వాతే మున్సిపల్ ఎన్నికల్లో చంద్రబాబు కోటను బద్దలు కొట్టాలని నిర్ణయం తీసుకున్నారు. చంద్రబాబుకు పెట్టని కోటలా వున్న కుప్పంలో వైసిపి బాగా వేసింది. ఆ తర్వాత 2024 ఎన్నికల్లో 175 స్థానాలు ఎందుకు గెల్చుకూడదు, వై నాట్ 175 అంటూ ప లు సందర్భాల్లో పలు సభల్లో జగన్ వ్యాఖ్యానించారు. నాటి జగన్ వై నాట్ 175 పై పార్టీ వర్గాల్లోనే గుసగుసలు వినిపించేవి. ఎలా సాధ్యం అంటూ కొందరు బహిరంగంగా వ్యాఖ్యానించేవారు. ఈ సీన్ కట్ చేస్తే.. 2024 ఎన్నికల్లో కడప జిల్లా పర్యటనకు వచ్చిన తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు వై నాట్ పులివెందుల అంటూ మాట్లాడారు. జగన్ వ్యతిరేకులకు వై నాట్ పులివెందుల చంద్రబాబు వ్యాఖ్యలు గుర్తుకు తెచ్చుకున్నట్లు తెచ్చాయా? లేకపోతే మరేంటి... పులివెందుల జడ్పీ స్థానం పరిధిలో పదే అంటే 10 గ్రామాలు. ఇన్ని గ్రామాల్లో పార్టీ శ్రేణులు ఏమయ్యాయి, పార్టీ నాయకులు ఎక్కడికి వెళ్లారు, కరుడుగట్టిన వైకాపా సానుభూతి పరుల ఓట్లు కూడా వేయలేకపోయారా? అంచనాలకు మించి టిడిపి పని చేసింది.

## ఉచిత ప్రవేశాలకు గడువు పొడిగింపు

దువ్వూరు, ఆగస్టు 14, ప్రభాతవార్త:

మండల పరిధిలోని ప్రైవేట్, అన్ని ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచిత విద్య కోసం ప్రవేశాల గడువును ఆగస్టు 20వ తేదీకీ పెంచినట్లు మండల విద్యాశాఖ అధికారి రమణయ్య తెలిపారు. విద్యా హక్కు చట్టం 2009లోని సెక్షన్ 12 ప్రకారం అర్హత కలిగిన పిల్లలు అన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 5 సంవత్సరాలు పూర్తి అయిన పిల్లలకు మొదటి తరగతిలో మిగిలిన 20 శాతం సీట్ల భర్తీ కోసం ఈ అవకాశాన్ని కల్పిస్తున్నట్లు అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన ఎస్సి, ఎస్టీ, మైనారిటి బీసీ ల వర్గాల వారికి చెందిన వారి పిల్లలు అర్హులు అన్నారు. ఎవరైనా చేరవలసిన వారు జనన, ఆధాయ, కుల నివాస, ఆధార్ కార్డు లతో అన్ లైన్ లో దరఖాస్తు చేసులోవాలని తెలిపారు.




## ఒంటిమిట్ట గెలుపు చంద్రబాబు, లోకేష్‌కు అంకితం

### ఒంటిమిట్ట ప్రజలు అందించిన ప్రజాస్వామ్య విజయం

### ప్రజలకిచ్చిన హామీలన్నీ తూచా తప్పకుండా నెరవేరుస్తాం

### మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జగన్ మోహన్ రాజు





రాజంపేట, ఆగస్టు14 ప్రభాతవార్త

ఒంటిమిట్ట జెడ్పిటిసి ఎన్నికల్లో ప్రజలు అందించిన ఈ విజయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్ కు అంకితం చేస్తున్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. జడ్పిటిసి అభ్యర్థి అందలూరు ముద్దుకృష్ణారెడ్డి విజయం అనంతరం మంత్రి మండిపల్లి, జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రాజుతో కలిసి ఒంటిమిట్టలో విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్నారు. పార్టీ నాయకులతో కలిసి కేకు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం కోదండ రాముని సన్నిధిలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ ఒంటిమిట్ట ప్రజలు తెలుగుదేశం పార్టీకి అండగా నిలిచి అత్యధిక మెజార్టీతో గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఒంటిమిట్ట జడ్పిటిసి ఎన్నికల్లో నిరంతరం శ్రమించి గెలుపుకు సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రాజుకు ఆర్ అండ్ బి మంత్రి జనార్దన్ రెడ్డికి, పార్టీ నాయకులకు కార్యకర్తలకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల్లో న్యాయానికి ,అన్యాయానికి మధ్య జరిగిన యుద్ధమని, న్యాయమే గెలిచిందని పేర్కొన్నారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధితో పోల్చితే ఈ ఎన్నికల్లో లభించిన విజయం చిన్నదే అన్నారు. అయితే ఈ గెలుపు ఒంటిమిట్ట అభివృద్ధికి దోహదపడాలన్నారు. తెలుగుదేశం పార్టీకి క్షేత్రస్థాయిలో బలమైన క్యాడర్ ఉందని, ప్రత్యర్థి పార్టీకి ఆ స్థాయి క్యాడర్ లేదని, అయితే క్యాడర్ ఎన్నికల్లో ఏకతాటిపై నిలిచి సత్తాను చాటి గెలుపు చూపించారన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో కూడా సంఘటితంగా పోరాడి విజయపరంపరను కొనసాగించాలన్నారు. ఎన్నికల్లో ఒంటిమిట్ట మండల ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తూచా తప్పకుండా నెరవేరుస్తామన్నారు. ఒంటిమిట్ట చెరువుకు ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేసేందుకు కచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ రాజు మాట్లాడుతూ ఒంటిమిట్ట ప్రజలు విజయం సాధించారని అన్నారు. 30 ఏళ్ల తర్వాత ఒంటిమిట్టలో ప్రజాస్వామ్యం గెలిచిందన్నారు. ఈ విజయం వైసీపీ అరాచకానికి చెంపపెట్టు అన్నారు. జడ్పీటీసీ ఎన్నికల పార్టీ ల మధ్య జరగలేదు. ఈ కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త కృష్ణ, రాష్ట్ర కల్లుగీత ఆర్థిక సహకార సంస్థ మాజీ డైరెక్టర్ కొమర వెంకట నరసయ్య, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు నరసింహా రెడ్డి, క్లాస్ వన్ కాం ట్రాక్టర్ ఎస్ వి రమణ, గీతాంజలి రమ ణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ రాజు, ఒంటిమిట్ట మండలం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.































## వాహనాలు తనిఖీ

ఓబులవారిపల్లి ఆగస్టు 14 ప్రభాతవార్త



కడప చెన్నై ప్రధాన రహదారి ఓబులవారిపల్లి మండలం హైవే రోడ్డులో గురువారం ఓబులవారిపల్లి ఎస్ఐ మహేష్ వాహనాలు తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఆయన వాహనదారులను . ఉద్దేశించి మాట్లాడుతూ రోడ్డు భద్రత ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ ద్విచక్ర వాహనాలు వారు హెల్మెట్లు ధరించి వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాలపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాహనాలు నడిపే వారికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

## ఘోర రోడ్డు ప్రమాదం

### ఇద్దరు మహిళలు మృతి, ఒకరికి తీవ్ర గాయాలు.

ముద్దనూరు. ఆగస్టు 14. ప్రభాతవార్త:

ఎర్రగుంట్ల మండల పరిధిలోని కలమల్ల వద్ద గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీపిపి నుండి ఫ్లయాస్ (బూడిద ) లోడుతో వెళుతున్న టిప్పర్ కలమల్ల క్రాస్ వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో సుభాషిని, గాయత్రి అను ఇరువురు మహిళలు అక్కడికక్కడే మరణించారు. మరో వ్యక్తికి వెంకటేష్‌కు గాయాలయ్యాయి. బాధితులు ముద్దనూరు మండలం కొసినేపల్లి గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. ప్రొద్దుటూరులో వివాహానికి హాజరై తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగినట్లు తెలిపారు. కలమల్ల ఎస్సై సునీల్ కుమార్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని టిప్పర్ ను అదుపులోకి తీసుకొని, మృతదేహాలను మరియు క్షతగాత్రులను ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సునీల్ కుమార్ రెడ్డి తెలిపారు..

## త్రివిధ ధలాలకు మద్ధతుగా తిరంగ ర్యాలీ

మైదుకూరు, ఆగస్టు 14, ప్రభాతవార్త:



79వ స్వాతంత్ర దినోత్సవము పునస్కరించుకొని భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు మైదుకూరు పట్టణములోని పాత మున్సిపల్ కార్యాలయం నుండి అంబేద్కర్ విగ్రహము వరకు తిరంగ ర్యాలీ చేపట్టడం జరిగినది.రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదిరించి ఎంతో మంది స్వతంత్ర సమర యోధులు వారి ప్రాణాలు త్యాగాలు చేశారు . వారి యొక్క త్యాగాలను స్మరించుకొంటూ మరియు ఆపరేషన్ సింధూరు విజయవంతం సందర్భముగా ప్రతి ఒక్కరూ వారి ఇంటి మీద జండా ఎగుర వేసి దేశ ఐక్యతను చాటుతూ త్రివిధ ధలాలకు మద్ధతుగా దేశ భక్తితో తిరంగ ర్యాలీ కార్యక్రమం చెపట్టడం జరిగింది. ఈ కార్య క్రమములో మైదుకూరు పుర ప్రజలు, బాల శివ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు , బాలశివ డిగ్రీ కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు,కడప జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు మాచ నూరు సుబ్బారాయుడు, మైదుకూరు అర్బన్ మండల ప్రెసిడెంట్ దేవేంద్ర, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గురప్ప, ఆర్.రామ కృష్ణ ,కిశోర్, నరసింహా రెడ్డి, తదితరులు పాల్గొనడం జరిగినది.

## జడ్పిటిసి ఉప ఎన్నికలో టిడిపి గెలుపు



ఒంటిమిట్ట ఆగస్టు 14( ప్రభాతవార్త)

ఒంటిమిట్ట జడ్పిటిసి ఉపఎన్నికకు ఈనెల 12 తేదీన ఓటింగ్ పూర్తి కావడంతో గురువారం ఓటింగ్ లెక్కింపు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పోలైన ఓట్లను లెక్కించగా తెలుగుదేశం పార్టీ నుంచి జడ్పిటిసి స్థానానికి అభ్యర్థిగా నిలిచిన ముద్దు కృష్ణారెడ్డి ప్రత్యర్థి ఇగమ్ రెడ్డి .సుబ్బారెడ్డిపై ఘన విజయం సాధించాడు. మండలం మొత్తం పైన 24660 సుమారుగా ఓటర్లు ఉండగా తెలుగుదేశం పార్టీకి 12780 ఓట్లు రాగా వైఎస్ కాంగ్రెస్ పార్టీకి 6513 ఓట్లు రావడం జరిగింది. దీంతో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డి 6267 ఓట్లతో ప్రత్యర్థి పై ఘనవిజయం సాధించడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, పార్లమెంట్ అధ్యక్షుడు జగన్మోహన్ రాజు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు కార్యకర్తలు హర్షద్వానాలు చేస్తూ టపాసులు కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఓటర్లు ముందడుగుతో ఆలోచించి తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టారన్నారు.

## నేడు మద్యం విక్రయాలు నిషేధం

గాలివీడు, ఆగస్టు 14(ప్రభాతవార్త):

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నేడు మద్యం విక్రయించడం నిషేధం అని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ పండుగలైన స్వాతంత్ర్య దినోత్సవం నాడు నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం ఉదయం నుండి మద్యం దుకాణాలు, బార్లు పూర్తిగా మూసివేయాలన్నారు. అలాగే చికెన్ దుకాణాలు కూడా పూర్తిగా మూసివేయాలని మాసం విక్రయించరాదన్నారు.

## విద్యార్థులకు అభినందనలు



పెండ్లిమర్రి, ఆగస్టు 14, ప్రభాతవార్త:

పెండ్లిమర్రి మండలం కేజీబీవీ ఇంటర్మీడియట్ (బైపీసీ) మొదటి సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు రాహెల్(423/440), అనుష్క(423/440)లను జీసీడీవో రూతు ఆరోగ్య మేరి అభినందించారు. గురువారం పాఠశాలను పర్యవేక్షించేందుకు వచ్చిన జీసీడీవో రూతు మేరి, ఎంఈవో-2 గంగాధర్ నాయక్‌లు విద్యార్థులను శాలువాతో సన్మానించారు. ఇంటర్మీడియట్ నందు వంద శాతం ఉత్తీర్ణత సాధించినందుకు విద్యార్థినిలను, ఉపాధ్యాయులను అభినందించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తహసీల్దారు కార్యాలయాన్ని తనిఖీ

కలికిరి, ఆగస్టు 14, ప్రభాతవార్త:



తహసీల్దారు కార్యాలయాన్ని మదనపల్లి నూత సబ్ కలెక్టర్ లావణ్య తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా గురువారం తహసీల్దారు కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. సకాలంలో రైతుల సమస్యలు పరిష్కరించాలని ఎటువంటి పరిస్థితుల్లో జాప్యం చేయరాదన్నారు. అనంతరం కలికిరి-3 సచివాలయాన్ని సందర్శించి అక్కడ మూమెంట్ రిజిస్టర్లు తనిఖీ చేయడం జరిగింది. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి అక్కడ వస్తున్న సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కరించాలని తెలిపారు. అనంతరం కలికిరి గ్రామ పంచాయతీ చెత్త సేకరణ విధి విధానాన్ని పరిశీలించి వర్మీకంపోస్టు తయారీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరికుమార్, సర్వేయర్ రెడ్డప్ప, కలికిరి గ్రామ పంచాయతీ ఈవో అశోక్‌కుమార్, కలికిరి ఇన్‌ఛార్జి ఎంపీడీవో మహ్మద్ రియాజుద్దీన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్ పథకాలతోనే కూటమి స్పందన

సంబేపల్లి ఆగస్టు 14 ప్రభాతవార్త:



వైసిపి నేతలు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాల ఎకిరి సంక్షేమ, అభివృద్ధి చైర్మన్ నాగేశ్వర నాయుడు,సంబేపల్లి సింగల్ విండో చైర్మన్ వంగిమళ్ళ శివప్రసాద్ రెడ్డి,బిజెపి నాయకులు రేపన శివప్రసాద్‌లు. వీరు సంబేపల్లి మండలం ప్రధాన రహదారిలో స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహం వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ కడప జిల్లాలో ఇటీవలే జరిగిన పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ లు కూటమి ప్రభుత్వంకు పట్టం కట్టిన ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్నికల హామీలలో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు తల్లికి వందనం, అన్నదాత సుఖీ భవ, పెన్షన్ పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్లు,మెగా డీఎస్సీ తో పాటు రేపటితో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తుండడంతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి ప్రజలలో విశేషమైన స్పందన లభిస్తుందని వివరించారు.

## బద్వేల్ నియోజకవర్గాన్ని కడప జిల్లాలోనే కొనసాగించాలి

బద్వేలు, ఆగస్టు 14 ప్రభాతవార్త



బద్వేల్ నియోజకవర్గాన్ని కడప జిల్లాలోనే కొనసాగించాలని అలాగే నియోజకవర్గ అభివృద్ధికి ఐదు వందల కోట్ల నిధులు కేటాయించాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బందెల ఓబయ్య డిమాండ్ చేశారు. గురువారం బద్వేలు పట్టణంలోని భగత్ సింగ్ నగర్ ఆ పార్టీ కార్యాలయంలో బద్వేలు ఏరియా కమిటీ సమావేశం చంద్రమోహన్ రాజు అధ్యక్షతన జరిగింది ఈ సందర్భంగా ఓబయ్య మాట్లాడుతూ... బద్వేలు నియోజకవర్గాన్ని అన్నమయ్య జిల్లాలో చేర్చకుండా కడప జిల్లాలోనే కొనసాగించాలని బద్వేలు నియోజకవర్గంలోని కలసపాడు కాశినాయన అన్నమయ్య జిల్లా రాజంపేటకు 150 కిలోమీటర్ల దూరం ఉందని గతంలో ఆర్డిఓ ఆఫీసు రాజంపేటలో ఉండడం వలన నియోజకవర్గ ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని అప్పుడే రెవిన్యూ డివిజన్‌ను బద్వేల్ లో ఏర్పాటు చేయాలని బద్వేలు నియోజకవర్గ ప్రజలు అనేక ఆందోళనలు కొనసాగించి రెవిన్యూ డివిజన్‌ను గత ప్రభుత్వంలో బద్వేలకు సాధించుకున్నారని తిరిగి బద్వేలును రాజంపేటలో( అన్నమయ్య) జిల్లాలో కలిపితే ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతారన్నారు. ఈ సమావేశంలో జిల్లా స్టాండింగ్ కమిటీ మెంబర్ ఎస్. చంద్రశేఖర్. జిల్లా కమిటీ మెంబర్ కె. జకరయ్య బి. అనిల్ ఏరియా కమిటీ సభ్యులు రామరాజు. బాబు. విజయరావు.జయరామరాజు నారాయణ. చంద్రపాల్. జయపాల్. పాండు. పట్టణ కమిటీ నాయకులు చెన్నయ్య. చంద్రయ్య. గురప్ప. ఈశ్వర్. దైవానందం. పోలయ్య. శ్యాంసన్. తదితరులు పాల్గొన్నారూ

## ఎద్దుల బండిని బైక్ ఢీ కొనడంతో వ్యక్తి మృతి

బ్రహ్మంగారిమఠం ఆగస్టు 14 ప్రభాతవార్త

మండల కేంద్రం లోని నరసన్నపల్లి గ్రామానికి చెందిన దేవరకొండ నరసయ్య యాదవ్(42)ఎద్దుల బండిని ఢీ కొనడంతో గురువారం మృతి చెందాడు.అదే గ్రామానికి చెందిన సోమిరెడ్డిపల్లి నరసయ్య వ్యవసాయ పని నిమిత్తం ఎద్దుల బండితో పొలం దగ్గరికి వెళుతున్న సమయంలో,దేవరకొండ నరసయ్య యాదవ్ బైకుతో వెనక నుండి వేగంగా వచ్చి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది.దీంతో నరసయ్య కుప్పకూలి పడిపోవడంతో అక్కడున్న వారు 108 ద్వారా పొద్దుటూరుకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందినట్లు సమాచారం.పూర్తి విషయాలు తెలియాల్సి ఉంది.

## పులివెందుల జడ్పిటిసి స్థానం టీడీపీ కైవసం

వేంపల్లె: ఆగష్టు 14 (ప్రభాత వార్త):

పులివెందుల జడ్పిటిసి అభ్యర్థి మారెడ్డి లతా రెడ్డి గెలుపు పులివెందుల అభివృద్ధి కి మలుపు అని జిల్లా టీడీపీ కార్యదర్శి సింగారెడ్డి జయ రామి రెడ్డి తెలిపారు. గురువారం వేంపల్లి లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ మొట్టమొదటి సారిగా పులివెందులలో టీడీపీ జెండా ఎగురవేసిందని అన్నారు. జరిగిన జడ్పీటీసీ ఎన్నికల్లో వైకాపా అభ్యర్థి హేమంత్ రెడ్డి పై టీడీపీ అభ్యర్థి మారెడ్డి లతా రెడ్డి 6,033 ఓట్లు మెజారిటీ సాధించారని చెప్పారు. అనంతరం మారెడ్డి లతా రెడ్డి కి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. లతా రెడ్డి గెలుపు పులివెందుల అభివృద్ధి కి మలుపు అని అన్నారు. జడ్పిటిసి గా గెలుపొందిన మారెడ్డి లతా రెడ్డి కి ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలియజేశారని తెలిపారు.

## బ్రహ్మంగారిని దర్శించుకున్న ట్రైనీ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి

బ్రహ్మంగారిమఠం ఆగస్టు 14 ప్రభాతవార్త



శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారిని దర్శనానికి వచ్చిన ట్రైనీ కలెక్టర్ నేలటూరు శ్రీకాంత్ రెడ్డి డిప్యూటీ తహసీల్దార్ జాన్సన్, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ సాంబశివ రెడ్డి, ఆలయ మేనేజర్ ఈశ్వరయ్య చారి పూర్వపు మఠాధిపతి కుమారుడు దత్తాత్రేయ స్వామి,ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు, ఈ ట్రైనీ కలెక్టర్ చెన్నూరు గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి కుమారుడు శ్రీకాంత్ రెడ్డి సివిల్స్‌లో మంచి ర్యాంకు సంపాదించి కలెక్టర్‌గా ఎంపిక అయ్యారు. శుక్రవారం ట్రైనింగ్ నిమిత్తం విధులలో వెళ్ళాలని ఈ సందర్భముగా ఆయన కుటుంబ సభ్యులు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వాముల వారిని దర్శించుకోవడం జరిగినది.

### ప్రజలను నమ్మించాలని

## ఈనాడులో తప్పుడు రాతలు

### కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి

పులివెందుల, ఆగస్ట్ 14 ప్రభాత వార్త:



ఓటింగ్ రోజున జరిగిన అబద్దాలను నమ్మించడానికి ఈనాడు పత్రికలో తప్పుడు రాతలు రాసారు అని, ఉత్కంఠకు తెర , నువ్వా నేనా, లోకేష్ అయితే ప్రజాస్వామ్యం నిలబడింది అంటూ ఎవరిని నమ్మించడానికి తప్పుడు రాతలు రాస్తున్నారని అసలు ఓటింగ్ జరిగి ఉంటే కదా కేవలం దొంగ ఓట్లు మాత్రమే జరిగిందని కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన మీడియాకు విడుదల తీసిన వీడియో నందు ఆయన మాట్లాడుతూ అసలు పులివెందుల జడ్పీటీసీ స్థానంలో ఓటింగ్ జరిగి ఉంటే కదా మీరు ఇలాంటి రాతలు రాయాల్సింది అని వేసుకుందే దొంగ ఓట్లు..దానికి ఉత్కంఠ అంటారు..నువ్వా నేనా అంటూ ఎందుకు రాతలు అని దానికి మళ్లీ ప్రజా స్వామ్యం నిలబడింది అంటూ స్టేట్ మెంట్లు ఇవ్వడం అనైతికమని అన్నారు. ఇక్కడ జరిగింది పులివెందుల, కడప జిల్లా వాళ్లకు మాత్రమే తెలుసు రాష్ట్రమంతా తెలియదు కాబట్టి ఎల్లో మీడియాలో ఇక్కడ అంతా సవ్యంగా జరిగినట్లు వార్తలు రాయించేసుకుంటున్నారనీ ఇక్కడ నిజంగానే ఏదో ఓటింగ్ జరిగింది దాంట్లో మేం గెలిచాం అని రాష్ట్ర ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారనీ దొంగ ఓటింగ్ జరిగిందని అందరికీ అర్థమైంది ఇలాంటి రాతలు రాసిన ప్రజలు నమ్మరన్నారు. నిజమైన ఓటింగ్ జరిగి ఐదు ఓట్లతో గెలిచిన ఎనలేని సంతోషం వారికి ఎనలేని బాధా మాకు కలిగేదన్నారు. పోలీసులను ఉపయోగించుకుని ఏజెంట్లను కూర్చొనివ్వకుండా ఏజెంట్ల ఫారాలు చించి గెలిచారని మీరు అనుకోవాలి తప్ప ప్రజలఅనుకోరన్నారు. పోలీసుల సంపూర్ణ సహకారం తో వేలాది మంది టీడీపీ కార్యకర్తలను బూత్ ల ఎదురుగా పెట్టి నిజమైన ఓటరు స్లిప్ లు లాక్కున్నారు అని నిజమైన ఓటరును అసలు పోలింగ్ బూత్ లోకే పోనివ్వలేదు అని దీన్ని ఎలక్షన్ అంటారా...? ఇంకేమైనా అంటారా..? ప్రజలు ఓట్లు వేసి ఉంటే కదా మీరు గెలిచాం అని చెప్పుకోడానికి..? ప్రశ్నించారు. దీన్ని ఎన్నిక అంటారో లేదో మీ విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు నిజంగా ఇది ఒక అనైతిక ఎన్నిక అని వైఎస్సార్సీపీ కార్యకర్తలు ఎవ్వరూ నిరుత్సాహపడాల్సిన అవసరం లేదనీ వీరికి గుణపాఠం చెప్పే రోజు వస్తుంది అప్పుడు ఇలా దొంగ ఓట్లతో కాదు మనం ఎప్పుడు చేసే విధంగా నిజమైన ఓటింగ్ తోనే వీళ్లకు గుణపాఠం చెబుదాం అన్నారు.

# 30 ఏళ్ల తర్వాత పులివెందుల జడ్పిటిసి తెదేపా కైవసం

### 6033 ఓట్ల మెజారిటీతో ఘన విజయం... విజయోత్సవాలు జరుపుకున్న టీడీపీ శ్రేణులు

పులివెందుల, ఆగస్ట్ 14, ప్రభాతవార్త:

పులివెందుల జడ్పిటిసి స్థానాన్ని 30 సంవత్సరాల తర్వాత తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకుంది. 1995 నుంచి వైయస్ కుటుంబ ప్రాతినిధ్య పార్టీ అభ్యర్థులే జడ్పిటిసి స్థానాన్ని గెలుపొందుతూ వచ్చారు. పులివెందుల జడ్పిటిసి స్థానాన్ని 2021 లో ఏకగ్రీవం చేసుకున్న వైకాపా పార్టీ అభ్యర్థి మహేశ్వర్ రెడ్డి మరణించడంతో ఉప ఎన్నిక జరిగింది. ఉప ఎన్నికలో వైకాపా తరఫున మరణించిన మహేశ్వర్ రెడ్డి కుమారుడు తుమ్మలూరు హేమంత్ రెడ్డిని అభ్యర్థిగా బరిలో దింపగా టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ బీటెక్ రవి సతీమణి లతారెడ్డిని బరిలో నిలిపింది. పోటాపోటీగా ప్రచారాలు నిర్వహించి ఇరు పార్టీలు సై అంటే సై అంటూ పోటీపడ్డారు. మంగళవారం ఎన్నికల పోలింగ్ జరగగా వైకాపా అభ్యర్థన మేరకు బుధవారం రెండు పోలింగ్ కేంద్రాలలో రీపోలింగ్ కూడా జరిగింది. కడపలోని ఉర్దూ యూనివర్సిటీ నందు ఓట్ల లెక్కింపు జరిగింది. మొత్తం 10601 ఓట్లు ఉండగా 7794 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో7638 చెల్లు బాటు కాగా 145 ఓట్లు తిరస్కరణ కాగా 11 ఓట్లు నోటా కి వచ్చాయి. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి లతా రెడ్డికి 6716 ఓట్లు రాగా సమీప వైకాపా అభ్యర్థి హేమంత్ రెడ్డికి 683 ఓట్లు కాంగ్రెస్ అభ్యర్థి శివ కళ్యాణ్ రెడ్డికి 101 ఓట్లు వచ్చాయి. టిడిపి అభ్యర్థి మా రెడ్డి లతారెడ్డి 6033 ఓట్ల తేడాతో గెలుపొందగా సమీప అభ్యర్థులకు ఎవరికీ కూడా డిపాజిట్ కూడా రాకపోవడం గమనహర్వం. పులివెందుల జడ్పీటిసిగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి ద్వారా మారెడ్డి లతా రెడ్డి అధికారిక పత్రాన్ని అందుకు న్నారు. లతా రెడ్డి గెలుపొందిన విషయం తెలియగానే పులివెందుల పట్టణంలోని స్థానిక తెదేపా కార్యాలయం నందు టిడిపి శ్రేణులు అభిమానులు టపాసులు పేల్చి జై చంద్రబాబు జై లోకేష్ బీటెక్ రవి అన్న నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేస్తూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా లతా రెడ్డి మాట్లాడుతూ పులివెందు ల జడ్పీటీసీగా గెలుపొందడం చాలా సంతోషాన్ని కలిగిస్తోందనీ నా గెలుపులో పాలుపంచుకున్న టిడిపి, జనసేనా, బిజెపి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు నాకు కొండంత ధైర్యంగా ఉండి నా గెలుపు కోసం అహర్నిశలు శ్రమించిన కూటమి నాయకులకు కార్యకర్తలకు మరియు పులివెందుల గ్రామీణ పరిధిలోని ఆరు గ్రామ పంచాయతీల ప్రజలకు, ఓటర్లకు ప్రత్యేక ధన్యవా దాలు తెలిపారు.



నియామక పత్రాన్ని అందుకుంటున్న టీడీపీ అభ్యర్థి మారెడ్డి లతా రెడ్డి

## ముఖ్యమంత్రిని కలిసిన మాజీ మండల ప్రెసిడెంట్

బద్వేల్ అర్బన్, ఆగస్టు 14, ప్రభాతవార్త



మంగళగిరి టిడిపి పార్టీ ఆఫీస్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును గురువారం బద్వేలు టిడిపి మాజీ మండల ప్రెసిడెంట్ బీరం జయరామిరెడ్డి మరియు ఆయన కుమార్తె బద్వేలు మాజీ బీరం శిరీషా రెడ్డిలు మర్యాద పూర్వకంగా కలిశారు.బద్వేలు లో గత 40 సంవత్సరాలుగా టిడిపి పార్టీకి అందించిన సేవలను గుర్తించి కష్ట కాలంలో కూడా పార్టీ కోసం సార్వత్రిక మరియు స్థానిక సంస్థల ఎన్నికల్లో నిలబడి పార్టీ కోసం నిజాయితీ గా పనిచేసినందులకు గాను తమ కుటుంబానికి సముచిత స్థానం కల్పించమని ముఖ్యమంత్రిని కోరుతూ వినతి పత్రం ఇవ్వడం జరిగింది, అలాగే టిడిపి పార్టీ కోసం మొదటి నుంచి బద్వేలు నియోజకవర్గం లో కష్టపడిన సీనియర్ నాయకులను గుర్తించాలని కూడా ఆయనకు విన్నవించడం జరిగిందన్నారు. దీనికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## జడ్పిటిసి లతా రెడ్డికి అభినందన వెల్లువ

పులివెందుల, ఆగస్ట్ 14 ప్రభాత వార్త:

పులివెందుల జడ్పిటిసి ఎన్నికల్లో ఘన విజయం సాధించినటువంటి మారెడ్డి లతా రెడ్డికి అభినందనలు వెల్లువలు వచ్చాయి. గెలుపొందిన విషయం తెలియగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి చరవాణి ద్వారా లతా రెడ్డికి అభినందనలు తెలిపారు. పులివెందుల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ ప్రాంతీయ కార్యాలయం నందు అభినందనలు తెలుపుతూ రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ షేక్. మహబూబ్ బాషా, రాష్ట్ర టి.ఎన్.టి.యు.సి అధికార ప్రతినిధి నల్లగారి. భాస్కర్ రెడ్డి,పట్టణ ప్రధాన కార్యదర్శి కాసిం వల్లి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా మహబూబ్ బాషా మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా పులివెందుల మండల జడ్పిటిసి ఎన్నికలను వైఎస్ కుటుంబం రాజకీయంగా కక్షపూరిత మరియు హింసాత్మక చర్యలతో ప్రత్యర్థులను నామినేషన్ వేయనికుండా ఏకపక్ష రాజకీయం చేస్తూ వచ్చారు కానీ ఈ యొక్క 2025 సంవత్సరంలో ఎన్నడూ లేని విధంగా బీటెక్ రవి సతీమణి మారెడ్డి.లతా ను తెదేపా అభ్యర్థిగా నిలబెట్టి పులివెందుల కంచుకోట ను బద్దలు కొట్టి తెలుగుదేశం జెండాను రెపరెపలాడించిందన్నారు.

## రక్తదానం ఒక సామాజిక బాధ్యత



పులివెందుల, ఆగస్ట్ 14, ప్రభాత వార్త:

రక్తదానం ఒక సామాజిక బాధ్యత అని మునిసిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్ పేర్కొన్నారు. పులివెందుల పట్టణం లోని భాష్యం పాఠశాలలో చైర్మన్ భాష్యం రామక్రిష్ణ, వైస్ చైర్మన్ హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్ రామ్ వారి ఆదేశాల మేరకు గురువారం ముందస్తు 79 వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు నిర్వహించడం.ఈ వేడుకలలో భాగంగా భాష్యం పాఠశాల ప్రిన్సిపల్ ఉమాదేవి సమక్షంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని మునిసిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్, ప్రిన్సిపల్ ఉమాదేవి, రక్తనిధి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భార్గవ్ లు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ శిబిరం లో పాఠశాల పేరెంట్స్ దాదాపు 40 మంది రక్తదానం చేశారు.ఈ సందర్భంగా మునిసిపల్ చైర్మన్ డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ రక్తదాన కార్యక్రమం ప్రతిఒక్కరు ఒక సామాజిక బాధ్యత గా భావించి రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఉమాదేవి మాట్లాడుతూ రక్తదానం చేయడం అంటే ప్రాణాపాయ స్థితి లో ఉన్నవారికి ప్రాణదానం చేసే ఈ అవకాశం దేవుడు మనిషికి ఇచ్చిన గొప్ప వరం అని కావున ప్రతి ఒక్కరు రక్తదానం తో ప్రాణదాతలు అయ్యేందుకు సిద్ధం గా ఉండాలన్నారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భార్గవ్ మాట్లాడుతూ 18 సంవత్సరాల పూర్తి చేసుకున్న వయసు వారి నుండి 60 సంవత్సరాలు వయసు వరకు ఆరోగ్యం గా ఉన్న ఎవరైనా ప్రతి 3 నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చు అన్నారు. అనంతరం రక్తదానం చేసిన పేరెంట్స్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో yes ఆర్గనైజేషన్ ఫౌండర్ వీర నారాయణ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ బృందం, రక్తనిధి సిబ్బంది, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు.

## చెక్కభజనకు ప్రాణం పోసిన కళాకారుడు పుల్లయ్య

బద్వేలు అర్బన్, ఆగస్టు 14, ప్రభాతవార్త

చెక్కభజనకు ప్రాణం పోసిన గొప్ప కళాకారుడు సగిలి పుల్లయ్య అని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఆర్టీసీ ఉద్యోగుల కార్యాలయంలో భజన కళాకారుడు ఎస్ పుల్లయ్య సంస్కరణ సభ ఓఎస్సీ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ పుల్లయ్య అతి చిన్న వయసులో చెక్కభజన నేర్చుకుని చెక్కభజనని ఊపిరిగా భావించి అనేక వేల ప్రదర్శన నుంచి గ్రామస్థాయి నుండి దేశ సరిహద్దును దాటుకొని ఇతర దేశాలలో కూడా చెక్కభజన కళారూపాన్ని ప్రదర్శించినటువంటి ఘనమైన కీర్తన కలిగిన వా డు ఎస్ పుల్లయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి, గాయకులు ఇరుపోతు శ్రీనివాస్ వర్మ, సంఘమిత్ర చైర్మన్ సోద్దల పెంచలయ్య, ఎం ఈ ఎఫ్ నేషనల్ కమిటీ మెంబర్ ఎస్ దేవానందం , ఎం ఈ ఎఫ్ బద్వేల్ నియోజకవర్గ అధ్యక్షులువై ఓబయ్య, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు గురుమూర్తి, పూలే ఆశ పూలే అంబేద్కర్ ఆశయ సాధన సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి ముండ్లపాటి పిచ్చయ్య, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు పడిగే వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు



## విదేశీ విద్యపై అవగాహన కార్యక్రమం

ఎడ్యుకేషన్ ఆగస్టు 14 ప్రభాతవార్త :

నిహార్ ఓవర్సీస్ ఆధ్వర్యంలో, వోక్స్ ఓవర్సీస్ సౌజన్యంతో, కడప జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్‌లో ఈ నెల 17వ తేదీ ఉదయం 10 గంటలకు విదేశీ విద్యపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. నిహార్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ రీజినల్ కోఆర్డినేటర్ నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు, "రష్యా, జార్జియా, ఫిలిప్పైన్స్, ఇటలీ, కజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్, ఆర్మేనియా, యుకె, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ వంటి దేశాల్లో ఎంబిబిఎస్, ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, హెల్త్‌కేర్, హోటల్ మేనేజ్‌మెంట్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ తదితర కోర్సులపై నిపుణులు పూర్తి వివరాలు అందిస్తారు. ఈ కార్యక్రమం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుంది. ముందస్తు నమోదు కోసం 7702172568 నంబర్‌కి కాల్ చేయాలని కోరారు.

## ఆడికృత్తిక మహోత్సవాన్ని విజయవంతం చేయండి

### ఆలయ ధర్మకర్తలు రాచపల్లి అనురాధ, సుబ్రహ్మణ్యం

మదనపల్లె, ఆగస్టు 14 ప్రభాతవార్త :



మదనపల్లె-నిమ్మనపల్లె రోడ్డులోని వశిష్ట స్కూల్‌కు సమీపంలో ఉన్న శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రమణ్య స్వామి దేవస్థానంలో ఈనెల 16న ఆడికృత్తిక మహోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ ధర్మకర్తలు రాచపల్లిల అనురాధ, సుబ్రహ్మణ్యంలు కోరారు. ఈ మేరకు ఆలయం వద్ద ఆడికృత్రిక మహోత్సవాలను విజయవంతం చేయాలని మదనపల్లె పరిసర ప్రాంత ప్రజలు, భక్తులకు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడికృత్రిక రోజున సుబ్రహ్మణ్య స్వామిని పూజించి ఆరాదిస్తే, ఎంతో మంచి జరుగుతుందని చెప్పారు. ఆరోజున ఆలయం వద్ద పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు, భక్తులు మోసి కావళ్ళు, భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 15న సాయంత్రం 5.30గంటలకు గణపతి హోమం, నవగ్రహ శాంతి, పరివార దేవతల హోమం, లక్ష్మీహోమం, సంతాన వేణుగోపాల స్వామి హోమం, రాత్రి 9గంటలకు అల్పాహారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆలయంలో రెండు రోజులు పాటు ఈ మహోత్సవాలు నిర్వహిస్తామన్నారు. పూజా కార్యక్రమంలో భక్తులకు అనేక సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.

## మదనపల్లె టూ టౌన్ సీఐ గా రాజారెడ్డి

మదనపల్లి క్రైమ్ ఆగస్టు 14 ప్రభాతవార్త.

మదనపల్లె టూ టౌన్ సీఐగా రాజారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న రామచంద్ర అన్నమయ్య జిల్లా రాయచోటి రెడ్ శాండిల్ యాంటీ స్పెషలిస్ట్ ఫోర్స్ సి ఐ గా బదిలీ అయ్యారు. దీంతో రాయచోటి ఎస్ బి సీఐగా పనిచేస్తున్న రాజారెడ్డిని మదనపల్లి రెండవ పట్టణ సిఐగా నియమించారు. గురువారం బాధ్యతలు స్వీకరించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, మదనపల్లి డి.ఎస్.పి మహేంద్ర ల సూచన మేరకు శాంతి భద్రతలను కాపాడుటకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తా మన్నారు. నేరాల నియంత్రణకు ప్రజలు, సిబ్బంది సహకారంతో ముందుకు పోతామని తెలిపారు.

## ఉచిత అడ్మిషన్ కొరకు దరఖాస్తు చేసుకోండి

రాజుపాలెం, ఆగస్టు 14, ప్రభాతవార్త.

5కిలోమీటర్ల లో ఉన్న ప్రైవేట్ అన్ఎయిడెడ్ పాఠశాలలలో మిగిలిన సీట్ల భర్తీ కొరకు దరఖాస్తులు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి రామస్వామి రెడ్డి తెలిపారు. 2025, 2026 విద్యా సంవత్సరంనకు సిబిఎస్ఇ / స్టేట్ సిలబస్ చదువు విద్యార్థులకు ఒకటో తరగతిలో ఉచిత అడ్మిషన్ కొరకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రజలను కోరారు. ప్రభుత్వం కల్పించిన 25 శాతం ఉచిత అడ్మిషన్ లను 5 సంవత్సరాలు నిండిన ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న కుటుంబాల పిల్లలు, ఎస్ టి, ఎస్ సి, బీసీ, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన పిల్లలు అర్హులు వారు ఈ అవకాశమును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకొనుటకు గ్రామ సచివాలయం లేదా మీ సేవ కేంద్రం, మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం, ఇంటర్నెట్ కేంద్రాలలో ఉచిత అడ్మిషన్ల కొరకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

## హౌసింగ్ డిఈ దీనదయాల్‌రాజుకు ఉత్తమ అవార్డు

మదనపల్లె, ఆగస్టు 14 ప్రభాతవార్త :



మదనపల్లె హౌసింగ్ డిఈ దీనదయాల్‌రాజుకు ఉత్తమ ప్రశంసాపత్రంకు ఎంపికయ్యారు. ఈ మేంకు రాయచోటి జిల్లా కార్యాలయం నుండి ఉత్తమ అవార్డుకు ఎంపికైనట్లు సమాచారం అందింది. 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి నుంచి ఈ ప్రశంసాపత్రాన్ని దీన్‌దయాల్‌రాజు అందుకోనున్నారు. హౌసింగ్ లబ్దిదారులకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రభుత్నవం నుంచి రాఆల్సిన బిల్లులు మంజూరు, పెండింగ్ బిల్లులు మంజూరు, అర్హుల ఎంపిక జాబితా, హౌసింగ్ టార్గెట్‌లను సకాలంలో పూర్తి చేనసినందుకు ఉత్తమ డిఈగా ప్రభుత్వం ఎంపిక చేసింది. రాయచోటిలో జిల్లా కలెక్టర్, హౌసింగ్ పీడి నుండి దీనదయాల్‌రాజు ఉత్తమ ప్రశంసాపత్రాన్ని అందుకోనున్నారు.

## మాజీ సిఎంను కలిసిన దండు శేఖర్‌రెడ్డి

మదనపల్లె, ఆగస్టు 14 ప్రభాతవార్త :



మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర మేధావుల సంఘం, వైసిపి ప్రధాన కార్యదర్శి, మదనపల్లె నియోజకవర్గ యువ నాయకులు దండు శేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం బెంగుళూరులోని జక్కూర్ ఎయిర్‌పోర్టు నుంచి అనంతపురంలో జరిగిన ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి కుమారుడి వివాహానికి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బయలుదేరారు. ఈ సందర్భంగా మాజీ సిఎం జగన్‌ను దండు శేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. వీరిద్దరూ కొంతసేపు రాష్ట్ర రాజకీయాలపై చర్చించుకొన్నారు. ముఖ్యంగా మదనపల్లె నియోజకవర్గంలో వైఎస్ఆర్ సిపికి పూర్వ వైభవం తీసుకొచ్చేలా పార్టీని బలోపేతం చేయాలని దండు శేఖర్‌రెడ్డికి మాజీ సిఎం సూచించారు. అనంతరం రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టుపై చర్చించారు. త్వరలోనే ఎంపి మిథున్‌రెడ్డి జైలునుండి బయటకు వస్తారని మాజీ సిఎం భోరోసా ఇచ్చారు.

## తాళ్లపాక గ్రామ ముద్దు బిడ్డ కృష్ణంరాజు



(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)

తాళ్లపాక గ్రామంలో కళాబందు డాక్టర్ బాలరాజు కృష్ణంరాజు వర్ధంతి సందర్భంగా గురువారం వారి విగ్రహానికి పుష్పాంజలి ఘటించి అనంతరం సభ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా వై సురేష్ రాజు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమములో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నంద్యాల జిల్లా ఇన్చార్జి పోతుగుంట రమేష్ నాయుడు, జనసేన జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరాజు, బిజెపి జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, ప్రముఖ న్యాయవాది క్షత్రియ సంఘం అధ్యక్షులు శరత్ కుమార్ రాజు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రతాప్ రాజులు మాట్లాడుతూ తాళ్లపాకకు గుర్తింపు కోసం ఎంతో కృషి చేసినటువంటి వ్యక్తి గుర్తుగా రాజంపేటలో వారి పేరు మీద ఒక ఆడిటోరియం నిర్మించాలని లేదా వారి పేరు మీద స్కాలర్షిప్ రాష్ట్ర స్థాయిలో చేయాలని, తాళ్లపాక గ్రామానికి కాకుండా సాహిత్యానికి ఎంతో సేవ చేశారని, జాతీయ సాంస్కృతిక రాయబారిగా వారు పని చేస్తారని ఇటువంటి గొప్ప వ్యక్తి మన ప్రాంతంలో జన్మించడం మనందరికీ గొప్ప గర్వకారణం అని అన్నారు. ఈ కార్యక్రమంలో వారి కుమారులు స్థానిక తాళ్లపాక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టుపోగల ఆదినారాయణ, బిజెపి నాయకులు కృష్ణ యాదవ్, చంగల్ రాజు, సుబ్బారావు, షబ్బీర్ అహ్మద్, హిమగిరి యాదవ్ వినోద్, కుమార్, కార్యక్రమ ప్రధాన నిర్వాహకులు కోడూరు వీరాంజనేయులు రాజు తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)

రాజంపేట రీజెన్సీ నలంద కళాశాలలో గురువారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. కృష్ణునికి ప్రియమైన అంశాలతో కూడి ఆకర్షణీయంగా సెట్స్ వేసి కృష్ణాలంకరణాలతో విద్యార్థులు క నుల విందు చేస్తుండగా కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీ కృష్ణాష్టమి పండుగ గురించి, ఆ కృష్ణ పరమాత్ముడు లీలల గురించి పెద్దలు, పిల్లలకు వివరించారు. ప్రేమ తత్వానికి ప్రతిరూపమైన శ్రీకృష్ణ అవతారంలోని పరమార్థము అందరికీ తెలియాల్సిన అవసరం ఉందని కళాశాల చైర్మన్ జి. ఎన్. నాయుడు పేర్కొన్నారు. నేటి సమాజానికి శ్రీ కృష్ణుడు ఉద్బోధించిన భగవద్గీత మార్గదర్శకంగా నిలుస్తున్నది అన్నారు.

## సీఎం చంద్రబాబు,ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

మదనపల్లెక్రైమ్, ఆగష్టు 14 ప్రభాతవార్త.



కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు సక్సెస్ కావడంతో మదనపల్లి పట్టణం నీరుగట్టువారిపల్లిలోని 34, 35వ వార్డులలో టిడిపి చేనేత విభాగం రాష్ట్ర నాయకులు బొమ్మిశెట్టి పురుషోత్తం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే షాజహాన్ బాషాల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బొమ్మిశెట్టి పురుషోత్తం మాట్లాడుతూ ఏపీలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. అనంతరం 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని వార్డు ప్రజలతో కలిసి త్రివర్ణ పతాకాలను చేత పట్టుకొని తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగ్యలక్ష్మీ,బొమ్మిశెట్టి సురేంద్ర, డి.రమేష్ రెడ్డి, సురేష్, ఆదినారాయణ, ద్వారకనాథ్, గురునాథ్, కృష్ణమూర్తి, భాస్కర్, గణేష్, అరుణ, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## భాష్యం పాఠశాలలో రక్తదాన శిబిరం



ప్రశంసా పత్రం అందిస్తున్న భాష్యం ప్రిన్సిపల్ రాజేశ్వరి

ప్రొద్దుటూరు. ఆగస్టు14. ప్రభాతవార్త:

పట్టణంలోని వైయస్ఆర్ కాలనీలో ఉన్న భాష్యం పాఠశాలలో 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా భాష్యం విద్యాసంస్థల అధినేత రామకృష్ణ, సీఈవో అనిల్ కుమార్, జెడ్ఈఓ ఉమాదేవి ఆదేశాల మేరకు రక్తదాన శిబిరాన్ని బుధవారం ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ రాజేశ్వరి తెలిపారు ఈ కార్యక్రమానికి జిల్లా సర్వజన ఆసుపత్రి వైద్యులు, డాక్టర్ గోపాల్, డాక్టర్ మోహన్ మరియు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్ మాట్లాడుతూ రక్తదానం చేయడం చాలా మంచి ఆలోచన అని, రక్తదానం వల్ల ఒకరి ప్రాణం కాపాడవచ్చునని అన్నారు. భాష్యం విద్యాసంస్థల అధినేత రామకృష్ణ పిలుపుమేరకు ఇలాంటి రక్తదాన కార్యక్రమం నిర్వహించినందుకు భాష్యం యాజమాన్యంకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ గంగాందేవి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వీడియో కాన్ఫరెన్స్‌లో సాగునీటి సంఘం ప్రతినిధులు

పెనగలూరు ఆగస్టు 14 ప్రభాతవార్త



తాసిల్దార్ కార్యాలయంలో గురువారం సాయంత్రం జరిగిన సీఎం వీడియో కాన్ఫరెన్స్ లో మండలంలోని 15 సాగునీటి సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి సాగునీటి సంఘం ప్రతినిధులు ప్రతినిధులను ఉద్దేశించి చేసిన ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. స్థానికంగా తమ పరిధిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఆయన సూచన చేశారు. ఈ సమావేశంలో తాసిల్దారు అమరేశ్వరి ఎంపీడీవో విజయరావు పాల్గొన్నారు.

## మలేరియాపై అవగాహన ర్యాలీ

ముద్దనూరు.ఆగస్టు14. ప్రభాతవార్త:



మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జోనల్ మలేరియా అధికారి జమాల్ భాష ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. వైద్యశాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకొని, పేషెంట్లకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా సిబ్బంది ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక వైద్యాధికారిని కరిష్మా ఆధ్వర్యంలో ఆరో వార్డులో గురువారం సీజనల్ వ్యాధులపై నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీలో పాల్గొని ప్రజలకు వ్యాధులు ప్రబలకుండా తగిన సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్ యాదవ్, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, జోనల్ మలేరియా కార్యాలయ అధికారి ఆరోగ్య విస్తరణ అధికారి నిత్య పూజయ్య, ల్యాబ్ టెక్నీషియన్ జాన్సన్ వైద్య సిబ్బంది ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులచే హర్ ఘర్ తిరంగా ర్యాలీ

రామసముద్రం ఆగస్టు 14 ప్రభాతవార్త



మండల కేంద్రం లోని ప్రభుత్వ కాలేజి ప్రిన్సిపాల్ చిట్టి బాబు ఆధ్వర్యంలో గురువారం కాలేజి విద్యార్థులచే హర్ ఘర్ తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. కాలేజి ప్రిన్సిపాల్ చిట్టి బాబు ర్యాలీని ప్రారంభించారు. కాలేజి నుండి ర్యాలీ గా అంబేద్కర్ సర్కిల్ వరకు వచ్చి కాలేజీ ప్రిన్సిపాల్ లెక్చరర్లు విద్యార్థులు మానవ హారం నిర్వహించి.విద్యార్థులు జాతీయ పతాకాలను చేతపట్టి భారత్ మాతాకు జై, వందే మాతరం అంటూ ముందుకు సాగారు.ఈ యాత్రలో ప్రిన్సిపాల్ చిట్టి బాబు, లెక్చరర్లు మోయనుద్దీన్, సత్యనారాయణ, రవి, చిరంజీవి, దశరథ రామిరెడ్డి, శ్రీనివాసులు, గిరిజ, వేదవతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## పులివెందుల గెలుపుపై తంబళ్లపల్లెలో సంబరాలు

తంబళ్లపల్లె ఆగస్టు 14 ప్రభాతవార్త :



పులివెందుల, ఒంటిమిట్ట జడ్పిటిసి ఎన్నికల్లో టిడిపి రికార్డు విజయం సాధించడంపై తంబళ్లపల్లె టిడిపి నాయకులు సంబరాలు చేసుకున్నారు. గురువారం ఉదయం క్రాస్ రోడ్, పాత బస్టాండ్‌లో టిడిపి నాయకులు పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి మిఠాయిలు పంచి సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ రెడ్డి, పురుషోత్తం, వీరాంజనేయులు, కాలా నారాయణ, దండువారిపల్లి రమణ,జగదీష్, భాస్కర్, మాదారపు రాజశేఖర్, శీను, రామ్మోహన్ రెడ్డి, సోమశేఖర్, నరేంద్ర, రామచంద్ర, రామచంద్రారెడ్డి, గంగుల్ రెడ్డి, నిజాముద్దీన్, పీర్ల మాబు,దళిత నాయకుడు రెడ్డప్ప, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నామినేటెడ్ పదవులకు

## రెడ్డి సామాజిక వర్గం అర్హత లేదా మహాశయ...?

### రెడ్డి వర్గానికి నామినేటెడ్ పదవులలో న్యాయం జరగదా...?



మాట్లాడుతున్న రెడ్డి సంఘం అధ్యక్షులు పులి సత్యనారాయణ తదితరులు

పీలేరు , ఆగస్టు 14 ప్రభాతవార్త:

రాష్ట్ర రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు నామినేటెడ్ పదవులుకు అర్హత లేదా అర్హులు కాదా వారిని పరిగణలోకి తీసుకోరా..? వారికి అందరితోపాటు నామినేటెడ్ పదవులు ఎందుకు ఇవ్వరు...? అని రాష్ట్ర రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు పులి సత్యనారాయణ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం 31 నామినేటెడ్ పదవులను ప్రకటించింది అందులో రెడ్డి సామాజిక వర్గానికి ఒక నామినేటెడ్ పదవి కూడా ఇవ్వకపోవడం శోచనీయమని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఎంతో కృషిచేసిన రెడ్డి సామాజిక వర్గాన్ని విస్మరించడం ఎంతవరకు సమంజసం అని రాష్ట్ర ప్రభుత్వం రెడ్లను దూరం చేస్తే వారిని విస్మరిస్తే వారికి పదవులు కట్టబెట్టకపోతే రాబోయే రోజుల్లో రెడ్ల సత్తా చాటడానికి సమాయత్తమవుతామని పులి సత్యనారాయణ రెడ్డి ఆదినారాయణరెడ్డి రాంప్రసాద్ రెడ్డి, తాతిరెడ్డి ప్రతాపరెడ్డి, పురుషోత్తం రెడ్డి, కృష్ణారెడ్డి, మన్యం రాజారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి శేషాద్రిరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి,జయరామిరెడ్డి దొరబాబురెడ్డి,జగన్నాథ్ రెడ్డి, దినేష్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి తదితర రెడ్డి సామాజిక వర్గం సభ్యులు ప్రభుత్వానికి తెలిపారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వము రెడ్డి సామాజిక వర్గాన్ని గుర్తించి వారికి నామినేటెడ్ పదవుల్లో ప్రకటించి వారికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ఆశ కార్మికుల యూనియన్ ఉద్యమ విజయం

మైదుకూరు, ఆగస్టు 14, ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం ఆశా కార్మికులకు గ్రాడ్యుటి 1,50,000 వేల రూపాయలు,ప్రసూతి సెలవులు 180 రోజులు ఆశా కార్మికుల సర్వీస్ 62 సంవత్సరాలకు చేసినందుకు ఏఐటియుసి రాష్ట్ర నాయకత్వం మరియు ఆశ యూనియన్ నాయకత్వ జిల్లా నాయకత్వ విజయం అన్నారు. ఆశా యూనియన్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికీ ఉద్యమ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి శ్రీరాములు ఆశా వర్కర్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వి రమణమ్మ స్థానిక నాయకురాలు ఎస్ సావిత్రి, ఎస్. మున్వర్ గ్రేస్, రుతమ్మ, నసీమూన్,వి. విజయలక్ష్మి,పద్మ, అనురాధ, ముంతాజ్, సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి ఎస్ షావలి, సిపిఐ పట్టణ కార్యదర్శి సుబ్బరాయుడు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు బి.పీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ

పీలేరు ఆగస్టు 14 ప్రభాతవార్త :



ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న మేనేజర్

కెనరా విద్యా జ్యోతి పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేసినట్లు పీలేరు కెనరా బ్యాంక్ మేనేజర్ దేవరింటి లోకేష్ తెలిపారు. గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మేనేజర్ తమ సిబ్బందితో కలసి స్కాలర్షిప్ లు అందజేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ సీనియర్ మేనేజర్ దేవరింటి లోకేష్ మాట్లాడుతూ పేద ఎస్సీ ఎస్టీ విద్యార్థినులకు విద్యా జ్యోతి పథకం ఎంతో ఉపయోగపడుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా చదువులో రాణిస్తూ, లక్ష్యంతో ముందుకు వెళ్లాలని అన్నారు. విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఉపకార వేతనాలు పొందిన వారిలో 8వ తరగతి ఎస్సీ విద్యార్థిని డి. అనూష, 9వ తరగతి ఎస్సీ విద్యార్థిని బి. వర్షిత, 10వ తరగతి విద్యార్థిని డి. హేమలత లకు చెరో రూ.5000 లు వంతున, అలాగే 5, 6 తరగతుల ఎస్సీ విద్యార్థినులు ఎస్. సంజన, జె. అనిత, 7వ తరగతి ఎస్టే విద్యార్థిని బి. లక్ష్మి ప్రియ లకు చెరో 3వేలు వంతున మొత్తం 6 మంది విద్యార్థులకు రూ.24,000 లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## తంబళ్లపల్లె చెరువుల అభివృద్ధికి ప్రాధాన్యత

తంబళ్లపల్లె ఆగస్టు 14 ప్రభాతవార్త :



పెద్దేరు ప్రాజెక్టతో పాటు మండలంలోని చెరువుల అభివృద్ధికి తంబళ్లపల్లె టిడిపి ఇన్చార్జ్ జయచంద్రారెడ్డి సహకారంతో మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెరువుల సంఘం అధ్యక్షుడు పెద్దేరు ప్రాజెక్టు చైర్మన్ కొటాల శివకుమార్ తెలిపారు. గురువారం తాసిల్దార్ కార్యాలయంలో ఇరిగేషన్ డి ఈ చెన్నకేశవరెడ్డి, ఏఈ సతీష్, తాసిల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో థామస్ రాజా, లతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న చెరువు సంఘం అధ్యక్షులు, కమిటీ సభ్యులతో మాట్లాడుతూ మండలంలోని చెరువుల అధ్యక్షులు, సభ్యులు చెరువుల సమస్యలు, అభివృద్ధికి చేపట్టాల్సిన పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

## రాష్ట్ర జంగం కార్పొరేషన్ చైర్మన్‌గా చంద్రశేఖర్

పీలేరు ఆగస్టు 14 ప్రభాతవార్త :



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఎన్నికల్లో విజయానికి కృషి చేసిన నేతలకు తగిన గుర్తింపునిస్తూ వివిధ కార్పొరేషన్లకు చైర్మన్‌లను నియమించింది. ఈ మేరకు 31 మందితో కూడిన జాబితాను ప్రభుత్వం మంగళవారం అధికారికంగా విడుదల చేసింది. కలికిరి మండలం కొటాల గ్రామానికి చెందిన నల్లారి కుటుంబ వీర విధేయతగా ఉన్న వాసునూరి చంద్రశేఖర్‌కు రాష్ట్ర జంగం సంక్షేమం, మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడం జరిగింది. ఈ సందర్భంగా కూటమి నాయకులు కార్యకర్తలు అనుబంధ సంఘాలు మహిళలు ఘనంగా సన్మానం చేశారు. రాష్ట్ర జంగం కార్పొరేషన్ అభివృద్ధి చైర్మన్ వాసునూరి చంద్రశేఖర్ మాట్లాడుతూ జంగం సంక్షేమ, మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ నియామకానికి సహాయ సహకారాలు అందించి శాయశక్తుల కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, శాసన సభ్యులు మంత్రి నారా లోకేష్ నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## రాహుల్ గాంధీపై జగన్ అనుచిత వ్యాఖ్యలు సరికాదు

ప్రొద్దుటూరు ఆగస్టు 14 ప్రభాతవార్త



రాహుల్ గాంధీపై జగన్ మోహన్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఇర్ఫాన్ భాష అన్నారు. గురువారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన వైయస్ జగన్మోహన్‌రెడ్డి రాజకీయ సంప్రదాయాలు పాటించకుండా రాహుల్ గాంధీపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఓటింగ్ విధానంలో సందేహాలకు ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా సమాధానం చెప్పాలని ఓట్ చోరీ క్యాంపెయిన్ పేరుతో పార్లమెంటు ఆవరణలో అన్ని పార్టీలకు చెందిన ఎంపీలు నిరసన వైసిపి ఎంపీలు ఎందుకు పాల్గొనలేదని ప్రశ్నించారు. ఏపీలో రెండు ప్రధాన ప్రాంతీయ పార్టీలు బిజెపికే మద్దతు ఇవ్వడం దురదృష్టకరమన్నారు.

## దళిత కాలనీకి దారి సౌకర్యం కల్పించాలి

లక్కిరెడ్డిపల్లి; ఆగస్టు 14, ప్రభాతవార్త



లక్కిరెడ్డిపల్లి హెచ్.పీ గ్యాస్ గోడౌన్ సమీపంలోని దళిత కాలనీకి దారి సౌకర్యం కల్పించాలని సిపిఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి మహేష్ సిపిఐ రాయచోటి నియోజకవర్గం కార్యదర్శి సిద్దిగాళ్ళ శ్రీనివాసులు అన్నారు. గురువారం వైయస్సార్ కాలనీలోని దళితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటి ప్రభుత్వం దళితులకు సర్వేనెంబర్ 713 లో రెండు ఎకరాల 80 సెంట్లు లో 90 నివాస స్థలాలు కేటాయించారు ఇందులో దాదాపు 35 మంది నివాసాలు ఏర్పరచుకొని నివసిస్తున్నారు. కానీ ఎటువంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో దళితులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు పక్కనే ఉన్న సర్వేనెంబర్ 714లో గల వ్యక్తులు ఈ వైఎస్ఆర్ దళిత కాలనీకి దారి లేకుండా 713 సర్వే నెంబర్లు గల భూమిని కూడా కలుపుకొని దళితుల ఇల్లు కనపడకుండా ప్రహరీ గోడను నిర్మించి దళితులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కావున రెవెన్యూ పోలీస్ అధికారులు స్పందించి వైయస్సార్ దళిత కాలనీ దారి సమస్యను పరిష్కరించాలని లేనిపక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో దళితవాడలోని ప్రజలు పాల్గొన్నారు

## మున్సిపల్ ఖజానాకు గండి కొడుగున్న ప్రభుత్వ అధికారులు

### సిపిఐ నాయకులు ఆరోపణ

మదనపల్లె, ఆగస్టు 14 ప్రభాతవార్త :



మదనపల్లె మున్సిపాలిటిలో డైలీ గేట్, వారపుసంత గేట్ టెండర్ల విషయంపై సిపిఐ నాయకులు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లాన్ల సహాయ కార్యదర్వి (క్రిష్ణప్ప), నియోజకవర్గ కార్యదర్శి మురళీలు మాట్లాడుతూ మదనపల్లె మునిసిపల్ కార్యాలయంలో రోజువారీ గేట్, వారపుసంత గేట్ టెండర్లు రెండు నెలల పాటు కౌన్సిల్ ఎందుకు ఆమోదించడం లేదని, దీని వెనక గల కారణాలు బయట పెట్టాలని డిమాండ్ చేశారు. టెండర్లు ఆగిపోవడం వల్ల మున్సిపల్ ఖజానాకు రోజుకు రూ.48వేలు, వారపుసంతలో వారానికి లక్ష రుపాయలు చొప్పున ఖజానాకు నష్టం జరిగిందన్నారు. పాలకులు, ప్రభుత్వ అధికారులు ఇలా నిర్లక్ష్యంతోనే మున్సిపల్ ఖజానాకు గండి పడుతోందన్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు, మదనపల్లె సబ్‌కలెక్టర్, జిల్లా కలెక్టర్‌లు స్పందించి ఈ ఆర్థిక నష్టాలపైన సమగ్ర విచారణ చేసి రీ టెండర్లకు నోటీసులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి మాధవ్‌కుమార్, నాయకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

### ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

మదనపల్లె, ఆగస్టు 14 ప్రభాతవార్త :



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటియుజి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ గురువారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్రీ బస్సు పథకం వల్ల రాష్ట్రవ్యాప్తంగా, జిల్లాలో స్వయం ఉపాధి రంగంలో జీవనం సాగిస్తున్న ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఉపాధి అవకాశాలు లేక స్వయం ఉపాధిగా తమ సొంత పెట్టుబడితో ఫైనాన్స్‌లు చెల్లించుకుంటూ, ప్రభుత్వానికి చెల్లించాల్సిన రోడ్డుట్యాక్స్‌లు చెల్లిస్తూ ఆటో డ్రైవర్లు కుటుంబాలను జీవనం సాగిస్తున్న డ్రైవర్ల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని తెలిపారు. రవాణా రంగ కార్మికులు అందరికి వేల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తామని మంత్రి లోకేష్ ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపి ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ముభారక్, ఆటోస్టాండ్ అధ్యక్షులు మక్బుల్‌బాషా, వలీబాషా, లోకేష్, శేఖర్, బావాజీ, అబీబ్, మురగన్ తదితరులు పాల్గొన్నారు.

## నియంత పాలనకు చరమగీతం

పెద్దమండెం ఆగస్టు 14 ప్రభాత వార్త



పులివెందుల జగన్ కంచుకోట గత నాలుగు దశాబ్దాలుగా ఓటు వేయడం ఎరగని ప్రజలు కూటమి ప్రభుత్వం రాకతో అందిస్తున్న సంక్షేమ పథకాలు సూపర్ సిక్స్ గ్యారెటీ అని నమ్మిన ప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగా కూటమి ప్రభుత్వానికి ఓటు వేసే నాలుగు దశాబ్దాల చరిత్రను తిరగరాసిన ఘనత తెలుగుదేశం పార్టీకి దక్కిందని మండల తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు జిట్టా వెంకటరమణ అన్నారు. గురువారం ఆయన టిడిపి కార్యకర్త తిమ్మయ్య దినానికి హాజరై సమాధి వద్ద పూలహార వేసి నివాళులర్పించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ పులివెందల ఒంటిమిట్ట లో జరిగిన జడ్పిటిసి పై ఎలక్షన్లలో కూటమి ప్రభుత్వం విజయ దంకా మోగించింది డిపాజిట్లు కూడా రాకుండా వైసిపి పార్టీ ఘోరంగా ఓడిపోయింది దీంతో పులివెందుల ప్రజలు వైసిపి జగన్ అరాచక పాలనపై మండిపడినట్లు ఈ గెలుపు నిదర్శనమని అన్నారు రాబోయే కాలంలో వై నాట్ పులివెందల అని కూడా నిరూపించి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటారని చంద్రబాబు లోకేష్‌ల అన్నారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు కార్యక్రమంలో మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## తాహిసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన సబ్ కలెక్టర్

రామసముద్రం ఆగస్టు14 ప్రభాతవార్త

మండల తహసీల్దార్ కార్యాలయాన్ని మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించి రెవెన్యూ సమస్యలపై తహసీల్దారు మహమ్మద్ అజారుద్దీన్ ను అడిగి తెలుసుకున్నారు. రెవిన్యూ సమస్యలపై అర్జీలన్నింటినీ త్వరితగతిన పరిష్కారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాహిసీల్దార్ అజారుద్దీన్ ఆర్ఐ.వసీం అహ్మద్, సీనియర్ అసిస్టెంట్ రెడ్డె ప్ప, మండల సర్వేయర్ నరేంద్ర,వీఆర్వోలు రెహ్మాన్, జగదీష్,రఘురామ్, అనూష, మమత, భారతి గౌరీ, అనూష, సునీత, రమణ సిబ్బంది పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనుల పరిశీలన

రామసముద్రం ఆగస్టు14 ప్రభాతవార్త



మండలం కె సి పల్లె గ్రామ పంచాయతీ గుంత ఎం బాడీ గ్రామంలో పరిశుద్ధ్య పనులు పరిశీలించిన ఎంపిడిఓ గపూర్ గ్రామంలో మంచినీటి కుళాయిలను పరిశీలించి వాటిని మరమ్మతు చేయించాలని పంచాయతీ కార్యదర్శి కి సూచనలు ఇవ్వడం జరిగింది. మురికి నీటి కాలువలు కూడా శుభ్రం చేయాలన్నారు.గ్రామంలో పైపులైన్లు లీకేజీలు లేకుండా అరికట్టాలని సూచించి తగు చర్యలు తీసుకోవాలన్నారు . అలాగే గ్రామంలో సామిత్వ పరిశీలించి గ్రామంలో జరుగుతున్నదా లేదా అని పరిశీలించి కార్యదర్శికి స్వామిత్వ పూర్తి చేయవలసిందిగా తగు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్. ఏ గపూర్ పంచాయతీ కార్యదర్శి గ్రీన్ అంబాసిడర్ లు పాల్గొన్నారు.

## తెలంగాణలో ఇంటర్ చదివిన APEAPSET కు అర్హులే

ఎడ్యుకేషన్ ఆగస్ట్ 14 ప్రభాతవార్త :

ఆంధ్ర ప్రదేశ్ రోస్టంలో లోకల్ అభ్యర్థి హోదాను నిరకరించడం పై దాఖలైన రిటి పిటిష్ పై ఆంధప్రదేశ్ గౌరవ హైకోర్టు తాత్కాలిక ఉపశమనం మంజూరు చేసింది, మద్దిలేటి ధిరజ్ కుమార్ రెడ్డి, కోత్యాల్ ముస్తఫా రయిన్ అనీ ఇద్దరు విధ్యర్థులు దాఖలు చేసిన రిట్ పిటిషన్ పై హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాసస్రి ఆదేశాలు జారిచేశారం, పిటిషనర్ల వాదన ప్రకారం ఆంధ్రప్రదేశ్లో ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు చదివి, అనంతరం ఇంటర్మీడియట్ పూర్తి చాసారు, అయినప్పటికి APEAPCET-2025 85 కోటాకింద ఏర్పర నిరకరించడం రాజ్యాంగ విరుద్ధం శని వారు నిరూపించారు . ఈ కేసులో పిటిషనర్ల తరుపున అడ్వకేట్ రమేష్ హోద్నాల , ప్రభుత్వం తరుపున ఉన్నత విద్య శాఖ రాష్ట్ర ఉన్నత విధ్య మండలి, APEAPCET కన్వీనర్ కి నోటీసులు జారిఅయ్యాయి, పిటిషనర్ల ధరఖాస్తులని లోకల్ కాండిట్లు పోదలో స్వీకరించాలిని హైకోర్టు ఆదేశాలిచ్చింది

## ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



రాజంపేట, ఆగస్టు14 ప్రభాతవా ర్త

రాజంపేట రాజు విద్యాసంస్థల్లో గురువారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కృష్ణాష్టమి పురస్కరించుకొని గోపికలు,శ్రీ కృష్ణుడు వేషధారణలో సాంప్రదాయబద్ధంగా చిన్నారులు అలంకరణ రాజు విద్యాసంస్థల సీఈఓ గుంటిమడుగు రఘురామరాజు, హెచ్ఎం మోహన్ రెడ్డిలు విద్యార్థులతో కలిసి ఉల్లాసంగా పాల్గొన్నారు. కృష్ణాష్టమి విశిష్టతను వారు విద్యార్థులకు వివరించారు. విద్యార్థిని, విద్యార్థులు శ్రీకృష్ణుడు, సత్యభామ వేషధారణలతో అలరించారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో విద్యార్దులు ఆద్యంతం ఉల్లాసంగా పాల్గొన్నారు. అనేక మంది విద్యార్దులు నృత్యాలు చేసి అలరించారు. పలువురు విద్యార్దుల తల్లిదండ్రులు తమ పిల్లలు శ్రీకృష్ణుడు, సత్యభామ వేషధారణలో చేసిన సందడి చూసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.తొలుత శ్రీకృష్ణుడు చిత్రపటానికి పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలగంగాధర్ నాయుడు, ఏఓ మల్లారెడ్డి, ఇంచార్జ్ హబీబ్, లోయర్ సెక్షన్ ఇంచార్జీ గుర్రంకొండ కృష్ణవేణి, సోనీ ఫర్జానా,తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అండగా నిలుస్తున్న సింఎం చంద్రబాబు

### ఎమ్మెల్యే షాజహాన్‌బాషా స్పష్టం

మదనపల్లె, ఆగస్టు 14 ప్రభాతవార్త :



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

తెలుగుదేశం పార్టీ అధిష్టానం పిలుపు మేరకు మదనపల్లె పట్టణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి గురువారం అన్నదాత సుఖీభవ పథకం విజయోత్సవ ట్రాక్టర్ ర్యాలీని గురువారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక జడ్పిహైస్కూల్ గ్రౌండ్ వద్దకు పెద్దసంఖ్యలో ట్రాక్టర్లు చేరుకొని అక్కడ నుండి సిటిఎంరోడ్డు, టౌన్ బ్యాంకు సర్కిల్, బెంగుళూరు బస్టాండు, కదిరి రోడ్డు, టమోటా మార్కెట్ యార్డు వరకు ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు కోసం పనిచేసే ఏకైక ప్రభుత్వం చంద్రబాబు, కూటమి ప్రభుత్వం మాత్రమేనని ప్రకటించారు. అలాగే పాడి రైతాంగానికి వర్క్‌షెడ్లు అందించడంతో పాటు వ్యవసాయంలో యాంత్రీకరణ పనిముట్లును సబ్సిడీ ధరలతో అందించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రభుత్వం రూ.11కోట్లు నియోజకవర్గ రైతులకు అందించడం జరిగిందన్నారు. నాయకులు, కార్యకర్తలు, అన్నదాతలు పాల్గొన్నారు.

## విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

ప్రొద్దుటూరు ఆగస్టు 14 ప్రభాతవార్త

పట్టణంలో అకాడమీ ఐఐటి మెడిసిన్ పేరుతో వెలసిన కళాశాలలో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తుపై వారి తల్లిదండ్రులు కళాశాల ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. విద్యార్థుల అడ్మిషన్లు చేసుకునేటప్పుడు ఇంటర్మీడియట్ కాలేజ్ కి సంబంధించిన అన్ని అనుమతులు ఉన్నాయని మోసం చేశారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కళాశాల యాజమాన్యంలో విభేదాల కారణంగా కళాశాలలో అధ్యాపకులు రాకపోవడంతో విద్యార్థులకు చదువు చెప్పే నాధుడే లేకుండా పోయారని వారి తల్లిదండ్రులు యాజమాన్యాన్ని నిలదీసేందుకు రాగా ఎలాంటి సమాధానం లేదని వాపోయారు. అంతేకాకుండా ఆకాడమికి ఇంటర్ మీడియట్ బోర్డు అనుమతి లేకపోవడంతో విద్యార్థులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఇంటర్‌తో పాటు ఇతర ప్రవేశ పరీక్షలను దృష్టిలో పెట్టుకుని ఎక్కువ మొత్తంలో ఫీజులు చెల్లించి తమ పిల్లలను అకాడమిలో చేర్పించామని ఈ విద్యాసంవత్సరం వరకు డైరెక్టర్లు కలిసి ఉండి తమ విద్యాబోధన చేసి తమ పిల్లలకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. డైరెక్టర్లు మధ్య వచ్చిన విబేదాలే సమస్యకు కారణ మని తల్లిదండ్రులు అంటున్నారు. తల్లిదండ్రులు చేపట్టిన ఆందోళనకు సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, పీడీఎస్ యూ నాయకుడు ఓబులేసు ఏఐఎస్ఎఫ్ నాయకుడు పీటర్, మద్దతు తెలిపి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కళాశాల నిర్వాహకులు విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. టుటౌన్ ఎస్సై ధనుంజయ కళాశాల యాజమాన్యంతో చర్చించి సెలవుల తరువాత సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థుల తల్లితండ్రులు ఆందోళన విరమించారు.



